మినీకథ

# పాలపొంగు

\- సాత్రిహాత్స్



'ఏయ్! విన్నే! లే!'

'వూ! ఏవిటండీ!'

'లెమ్మంటూంటే! విన్నే! మొద్దూ! లే!'

'ఏవిటండీ! ఈ అర్ధరాత్రి...'

'అబ్బో! ఏవీ ఎరగని నంగనాచిలా! లే!'

'అబ్బబ్బ! ఏమిటో చెప్పకుండా అలా గావుకేకలు వేస్తారేవిటి?'

'ఏవిటి? నావి గావుకేకలా! ఈ నా కుడి చెంపమీద బలంగా బాది, రక్క......ఏమీ తెలియని దానిలా నిద్దరోతున్నావా?'

'నేనేవిటండీ! కొట్టడ మేమిటండీ!'

'మన మిద్దరమే కదా ఈ గదిలో ఉంట'

'అవునండీ మన మిద్దరమే వున్నాం!'

'ఇలా ఆ దీపకాంతిలో చూడు! నా చెంప నుంచి రక్తం ఎలా వస్తోందో! నా ప్రేమకు తగ్గ శిక్ష వేశావే రాక్షసీ!'

'అదేంటండీ! మిమ్మల్ని కొట్టవలసిన అవసరం ఏముందండీ నాకు!'

'నీ గురించి కదే నా తల్లిదండ్రుల్ని కాదని ఇలా లేచి వచ్చేశా! ఆస్తి పాస్తుల్ని తెగ తెంపుకొని వచ్చేసా!'

'నేను మాత్రం అలా రాలేదా! మీరొక్కరేనా!'

'నాలో మెతక కనిపెట్టి నేనేం చేసినా భరించక ఛస్తాడా అని కదా నన్ను ఇలా కొట్టావ్!'

'ఛఛ! ప్రేమించిన భర్తని కొట్టేంత మూర్ఖు రాల్ని కాదండి! నామాట నమ్మండి!'

'ఛస్తే నమ్మను! నిన్ను నేను నమ్మను నమ్మలేను! ఇలా ఎంతమందితో ప్రేమ వ్యవహారం సాగించావో! పో! వూ ముందు ఆ తలుపు తీసికొని బయటకు చావు!'

'అర్ధరాత్రండీ! అవతల హోరున వర్షం! కటిక చీకటి! నేనేం పాపం చేయలేదు! నమ్మండి! నా మాట నమ్మండి!'

'నమ్మేకదే ఇంతపీకమీదకి తెచ్చుకున్నా! నిన్ను బయటకు గెంటేస్తే తప్ప నిజం చెప్పవు! నన్ను చచ్చేలా కొట్టి దొంగ నిద్ర పోతున్నావా ఏమీ తెలియనిదానిలా! నా ప్రేమకు తగ్గ గుణపాఠం నేర్పావు! లే!'

విసురుగా రంగనాథం ఒక చేత్తో తన ప్రేయసి చేతిని తీసుకుని మరోచేత్తో గది గడియతీసి బయటకు వెళ్లబోయే సమయంలో ఒక నల్ల పిల్లి 'మ్యావు' అంటూ మంచం కిందనుంచి బయటకు వచ్చి చీకట్లోకి దూసుకు పోయింది.